క్లుప్తంగా

మద్యం అక్రమ విక్రేతపై కేసు నమోదు

సంగెం : ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 20న హెడ్ కానిస్టేబల్ ఎ.చందర్‌రావు పెట్రోలింగ్ చేస్తుండగా మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో చిర్ర ఆనంద్ అక్రమంగా, అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆనంద్ నుంచి రూ.3,650 విలువైన మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పాకనాటి నర్సింహారెడ్డి సతీమణి భారతి (72) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వెంట మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, డాక్టర్ రాజేశ్వర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి తదితరులున్నారు.

ఆర్థికసాయం

దామెర : బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. దామెర మండల కేంద్రానికి చెందిన మేరుగు సంపత్ ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. కాగా 1993–94 విద్యాసంవత్సరంలో అతనితో కలిసి పదోతరగతి చదివిన మిత్రులు బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. అనంతరం రూ. 22,000లను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కడారి రమేష్, నాగబెల్లి ఐలయ్య, రమేష్, మల్లయ్య, రవి, రాజు, ప్రేమ్‌కుమార్, సతీష్, రవి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు : మండలంలోని ఊట్ల గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఆర్మీ జవాన్ లింగాల వెంకటేశ్వర్లు బుధవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వీర జవాన్ వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాజులగట్టుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త సుఖ్యా నాయక్, పడమటితండా జీపీకి చెందిన బానోత్ బాలు, అజ్మీరా భూలి, మాలోత్ మాన్‌సింగ్ మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి సాయం అందించారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, వాంకుడోత్ కొమ్మాలు నాయక్, బొల్లికొండ మధుగౌడ్, చంటి స్వామి, రసూల్, అర్రెం వీరాస్వామి, రాసమల్ల యాకయ్య పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

తొర్రూరు : డివిజన్ కేంద్రంలో నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డి తెలిపారు. తొర్రూరు పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలోకి పోలీసులు వెళ్లగా అప్రమత్తమైన నిందితుడు గుడుంబా బాటిళ్లు, ద్విచక్రవాహనాన్ని వదిలివెళ్లాడు. దాదాపు 20 లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు, వాహనాన్ని సైతం సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు మండలంలోని పోలెపల్లి శివారు తాన్యాతండాకు చెందిన గుగులోత్ వెంకన్నగా గుర్తించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

గూడూరు : ఎండాకాలం, వానాకాలంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏడీఈ కె.కవిత ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని గూడూరు, అయోధ్యపురం సెక్షన్ల విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏఏఓ రమేష్, ఏఈ ప్రణీత్, సబ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

హన్మకొండ: స్వశక్తితో స్వయం ఉపాధి పొందుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉషా ఇంటర్నేషనల్ డిప్యూటీ మేనేజర్ రాజ్ కుమార్ సూచించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ రాంనగర్‌లో రిసోర్స్ పర్సన్ శిక్షణ కార్యక్రమంలో రాజ్ కుమార్ మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా ఉష ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో దేశంలో దాదాపు 12 లక్షల మంది మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చామని తెలిపారు. తెలంగాణలో సర్వోదయ యూత్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో 465 ఉషా సిలాయి స్కూల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, జ్యోత్స్న, సతీష్, రవీందర్, మంజుల, అనిత, లావణ్య, అరుణ, విమల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

గీసుకొండ : శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎలుకుర్తి, ఆరెపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేయడం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఊకల్ క్రాస్ వద్ద పోలీసులతో కలిసి అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకన్న, షేక్ జానీ పాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గీసుకొండ : ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

నల్లబెల్లి : మండలంలోని బొల్లోనిపల్లిలోని చెక్‌పోస్టు వద్ద నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్, ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడారు. అక్రమంగా మద్యం, డబ్బు, ఇతర విలువైన వస్తువులు తరలించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధికారులు, సిబ్బందికి వివరించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.



నల్లబెల్లి : వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

డీసీతండా సమీపంలో..

వర్ధన్నపేట : పట్టణ పరిధిలోని డీసీ తండా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులతో కలిసి అధికారులు గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసాగర్ మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యం పంచకుండా ఉండడానికి పటిష్టమైన చర్యలు చేపడతున్నామని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. డబ్బు, వస్తువులు, ఇతర బహుమతులు పంపిణీ చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. ప్రతీఒక్కరు ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఉండి సహకరించాలని కోరారు. ప్రలోభాలకు గురి చేయడానికి ఎవరైనా యత్నిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను సూచించారు.



వర్ధన్నపేటలో..

టీకాతో గాలికుంటు వ్యాధి నివారణ



సంగెం : పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ రాజు



నెక్కొండ : టీకా వేస్తున్న డాక్టర్ మమత

సంగెం : పశువులకు టీకాలు వేయించడం ద్వారా గాలికుంటు వ్యాధిని నివారించొచ్చని మండల పశు వైద్యాధికారి వల్లె రాజు తెలిపారు. మండలంలోని కొత్తగూడెంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్‌గా పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలోనే టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. గాలికుంటు వ్యాధి బారిన పడకముందే టీకా వేయించి పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సూచించారు. చికిత్స కంటే నివారణ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు కమాలాకర్, బాబు, జితేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో పశు వైద్యాధికారి మమత పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం రైతులకు, పశు పోషకులకు పలు సూచనలు చేశారు. పశువులు గాలికుంటు (సొల్లు రోగం) వ్యాధితో అస్వస్థతకు గురై మృత్యువాత పడే ప్రమాదం ఉందని చెప్పారు. కాళ్ల గిట్టల మధ్య పుండ్లు పడి, నోటి నుంచి సొల్లు కారుతూ, జ్వరం వచ్చి ఆకలి మందగించడం లాంటి లక్షణాలతో బాధపడుతున్న పశువులను తక్షణమే సమీపంలోని ఆస్పత్రిలో పశు వైద్యాధికారికి చూపించి వైద్యం చేయించాలని సూచించారు. లేనిపక్షంలో వ్యాధి సోకి గాలికుంటు వ్యాధి లక్షణాలున్న పశువులు ఎక్కువ సంఖ్యలో మృతి చెందుతాయని తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది సునీత

నర్సంపేట : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యాయవాది సునీత కోరారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా న్యాయవాది సునీత అతిథిగా హాజరై మాట్లాడారు. హక్కులను పరిరక్షించడంతోపాటు బాల్యవివాహం, మహిళల అక్రమ రవాణా, వరకట్నం, గృహహింస, తదితరాల బారి నుంచి కాపాడేలా అనేక చట్టాలున్నాయని చెప్పారు. ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఖచ్చితంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో సమస్యలను సులువుగా అధిగమించవచ్చని చెప్పారు. సదస్సులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పెండెం రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



నర్సంపేట : వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. ఇటీవల పట్టణంలోని నల్లాల బావి, ఫిల్టర్ బెడ్, వరమ్మతోట బావిని మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించిన సమయంలో అధికారులకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు తాగునీటి ఏర్పాట్లను చేపట్టి నల్లాల బావి వద్ద సిబ్బందితో పనులు చేపట్టారు.

ప్రజాచైతన్యంతోనే ఓటు సద్వినియోగం

వర్ధన్నపేట : ప్రజాచైతన్యంతోనే ఓటు సద్వినియోగం అవుతుందని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. స్వీప్–2024లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య ఈసీ సభ్యులకు క్యాంపస్ అంబాసిడర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో నూరు శాతం ఓట్లు పోలయ్యేలా చూడాలని చెప్పారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించి పోలింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. తద్వారా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగయ్య, ఎంపీఓ ధనలక్ష్మి, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

చెన్నారావుపేట : పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కోడి మంజుల, రాధ తెలిపారు. మండల కేంద్రంలోని 2, 4, 5, ఎస్సీ కాలనీ, జోజిపేట నారాయణ తండా, సూర్యపేట తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. అనంతరం సూపర్‌వైజర్లు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీబాయి, దేవమ్మ, మంజుల, విజయ, సరోజ, సునీత, శౌరీ పాల్గొన్నారు.



అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ మంజుల

'నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ'

దుగ్గొండి : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నారని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒంటి పూట బడుల నిర్వహణకు ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ, విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తోందని చెప్పారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మధ్యాహ్నం వరకు మాత్రమే తరగతులు నిర్వహించాల్సి ఉండగా సాయంత్రం వరకు నడపడంతో విద్యార్థులు నీరసించిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న శివకుమార్, నాయకులు

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

నెక్కొండ : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్ తెలిపారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు నేపథ్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. మున్నూరుకాపు కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పడాల రవికుమార్, నాయకులు గై లక్ష్మణ్, ఎడ్ల కిష్టయ్య, సురేందర్, యాకయ్య, హరికృష్ణ, సత్యనారాయణ, నరేశ్, రాజు, సందీప్, బుచ్చయ్య, నగేశ్, కుమారస్వామి, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం



వేలంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులోని గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎంపీఓ తుల రామ్మోహన్, స్పెషలాఫీసర్ కిరణ్‌కుమార్ వేలం వేశారు. మూడు రూములను మాధవరావు, మంగిశెట్టి రాజు, కోల్కొండ రాజు రూ.1,02,200 దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండి అనూశ రాజబాబు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ నాయక్, కారోబార్ ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు తైబజార్‌కు..

పర్వతగిరి : నేడు (శుక్రవారం)స్థానిక గ్రామ పంచాయతీ తైబజార్‌కు వేలం నిర్వహిస్తామని ప్రత్యేక అధికారి మాలోతు శంకర్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్, పశువులు, మేకలు రహదారి పన్నుల వసూలుకు 2024–25 సంవత్సరానికి గాను వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి రూ.500 షెడ్యూల్ పొందాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 20 గదులకు సైతం వేలం నిర్వహిస్తామని వివరించారు. షాపింగ్ కాంప్లెక్స్ వేలానికి పాల్గొనే వ్యక్తులు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

గాదె హర్షితకు అభినందన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట సమీపంలోని కాపువాడకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ గాదె హర్షిత దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోటలోని ప్రత్యేక పరేడ్‌లో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను గురువారం రంశాయిశాపేటలో కాంగ్రెస్ నేత దామరకొండ కరుణాకర్, ఇటుకల అశోక్, పుసాల కిరణ్, కేడల చంద్రశేఖర్ తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంచ మల్లయ్య, కర్ర కుమార్, చిట్ల హేమలత, నిర్మల, పద్మావతి, కల్పన, స్వరూప, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో మొక్కల సంరక్షణ

నల్లబెల్లి : జీవామృతంతో నర్సరీల్లోని మొక్కలను సంరక్షించొచ్చని ఎంపీఓ కూచన ప్రకాశ్ తెలిపారు. మండలంలోని నందిగామ, రేలకుంట, రంగాపురం, ముచ్చింపుల, ముచ్చింపుల తండా, అర్షనపల్లి, రాంతీర్థం, కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఆయన సందర్శించారు. నర్సరీల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వివరించారు. జూన్‌లో ప్రభుత్వం నిర్వహించనున్న హరితహారం కార్యక్రమ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. నర్సరీల్లో జీవామృతం తయారు చేసి అందుబాటులో ఉంచాలని తెలిపారు. జీవామృతాన్ని క్రమం తప్పకుండా మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. ప్రాథమిక నారుమడిని ఏర్పాటు చేయాలన్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీఓ ప్రకాశ్

'లయన్స్' బెస్ట్ ప్రెసిడెంట్‌గా అనిల్‌కుమార్

రాయపర్తి : లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట బెస్ట్ ప్రెసిడెంట్‌గా మండల కేంద్రానికి చెందిన రావుల అనిల్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు పెండెం రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్సీ మీట్‌లో ఆయన అవార్డు అందుకున్నారు. మండలంలోని గ్రామాల్లో సేవా కార్యక్రమాలు అందించినందుకు గాను అవార్డు వచ్చినట్లు అనిల్‌కుమార్ తెలిపారు. ఉత్తమ కార్యదర్శిగా బుద్ద సునీల్‌కుమార్, ఉత్తమ ట్రెజరర్‌గా మధు, ఉత్తమ జోన్ ఛైర్మన్‌గా మందాటి సుదర్శన్‌రెడ్డి సైతం అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ను క్లబ్ ప్రతినిధులు, మండల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో కొమురవెల్లి లింగమూర్తి, సరికొండ కృష్ణారెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న అనిల్‌కుమార్

రంజాన్ కానుకలు సరిపడా అందించాలి

ఆత్మకూరు : రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు రంజాన్ కానుకలు సరిపడా అందించాలని మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబుమియా అన్నారు. మండలానికి చెందిన ముస్లింలకు నిధులు కేటాయించాలని కోరుతూ పరకాల ఆర్డీఓ నారాయణకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబుమియా మాట్లాడుతూ.. మండలానికి రూ.లక్ష నిధులు, 1500 తోఫా ప్యాకెట్లు అందించాలని కోరారు. అలాగే మైనారిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమజాన్ అలీ, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొంగుబంగారంగా 'జలిదేవి' జాతర

గంగారం : కోరినవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జలిదేవి అమ్మవారి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గంగారం మండలంలోని బావురుగొండలో బంగారు వజ్జయ్య, జలిదేవిలను గుట్ట నుంచి గురువారం ప్రధాన పూజారులు కంకవనాన్ని గద్దెలపైకి తీసుకొచ్చారు. గద్దెలపైకి దేవతలను తీసుకొస్తుండగా గ్రామస్తులు బిందెలతో నీళ్లు ఆరబోశారు. పిల్లలు లేని వారు వరంపట్టారు. అనంతరం దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించగా గ్రామస్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తలపతులు, వడ్డెలు, ప్రధాన పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తలపతి (ప్రధాన పూజారి) వజ్జయ్య, వడ్డెలు దారం సమ్మయ్య, దారం రాజేష్, మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, వైస్ ఎంపీపీ ముడిగ వీరభద్ర పోతయ్య, మాజీ ఎంపీటీసీ వజ్జ సమ్మక్కసారంగపాణి, కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య, వజ్జ వెంకటేశ్వర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



గుట్ట నుంచి కంకవనం తీసుకొస్తున్న ప్రధాన పూజారులు

ఎంపీ ఎన్నికల్లో యువత సత్తా చాటాలి

తొర్రూరు రూరల్ : ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి యువత సత్తా చాటాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్‌యాదవ్ కోరారు. గురువారం మండలంలోని పోలెపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో పలు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి ఓటు వేయాలని కోరాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అమ్మ' కమిటీలతో పాఠశాలలు బలోపేతం



కమిటీల సభ్యులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఐనవోలు : అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలలు మరింత బలోపేతం కానున్నాయని సింగారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రాజు అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఛైర్‌పర్సన్‌గా మహిళా సంఘాల అధ్యక్షురాలు ఖాతా వెంకటమ్మ, కన్వీనర్‌గా హెచ్ఎం శ్రీనివాస్‌రాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రతీ తరగతి నుంచి పిల్లల తల్లులు, మహిళా సంఘ సభ్యులను ముగ్గురు చొప్పున ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటయ్య పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేయొద్దు



దామెర : అనుమతిలేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా కేసు నమోదు చేస్తామని ఎస్సై అశోక్ హెచ్చరించారు. మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన పసుల అర్జున్ తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నాడు. కోగిల్వాయి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులకు ఇసుక ట్రాక్టర్ తారసపడినట్లు తెలిపారు. దీంతో తనిఖీ చేయగా అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అర్జున్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక, మొరం తరలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.